www.jananinadam.com

Follow:

జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం

తెలుగు దినపత్రిక



శనివారం 17-10-2026

సంపుటి : 2 సంచిక : 160

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from ,Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com

24గంటలు కరెంట్ ఇస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చాక 6గంటలే మాత్రమే ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ కోతలు..

ఎండిపోతున్న పంటలు..

సింగరేణిని సంక్షోభంలోకి నెట్టి తెలంగాణను చీకట్లోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజం



నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభం, రైతుల సమస్యలు, సింగరేణి సంస్థ పరిస్థితి, ప్రభుత్వ విధానాలపై పలు ప్రశ్నలు సంధించారు.రైతులకు కరెంట్ కోతలు.. ఎండిపోతున్న పంటలుతెలంగాణ రాష్ట్రంలో ఒకప్పుడు రైతులకు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని కౌశిక్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో కరెంట్

కరీంనగర్16:తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించలేని పరిస్థితి నెలకొనడం, పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలకు నిదర్శనమని ఆయన అన్నారు. హుజురాబాద్‌లో

పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు

విద్యుత్ సరఫరా చేయాలి

వచ్చే 20 రోజులు అత్యంత కీలకం.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సహించేది లేదు

విద్యుత్ అధికారులపై సీఎం తీవ్ర ఆగ్రహం.. నిర్లక్ష్యం చేస్తే ఐఏఎస్ లను సస్పెండ్ చేస్తామని హెచ్చరిక


ఎల్‌నినో కోవిడ్ లాంటి విపత్తు.. అప్రమత్తం కాకపోతే సంక్షోభమే

వచ్చే జూన్ వరకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

తాగునీరు, పశుగ్రాసానికి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు

ప్రతి మండలానికి గ్రూప్1, గ్రూప్2 అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ

: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్ 16: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సరఫరా పెంచాలని సూచించారు.రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి

కరువుపై ముందస్తు చర్యలు చేపట్టటంలో ముఖ్యమంత్రి అట్టర్ ఫ్లాప్



ప్రెస్ మీట్ పెట్టి తాను ఏం చేయలేనని చేతులెత్తేశారు

రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతోనే ఈ దుస్థితి

రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇవ్వడంతో పాటు ఇన్సూరెన్స్ చేయించాలి

రాష్ట్రం కరువులో ఉంటే సీఎం యాదాద్రి పవర్ ప్లాంట్ ను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తున్నడు

పవర్ మ్యాక్స్ కంపెనీతో ఉన్న ఒప్పందం ఏమిటో బయట పెట్టాలి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ 16: కరువు వస్తుందనే ముందే హెచ్చరించినా ముందస్తు చర్యలు చేపట్టడంలో సీఎం రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచే ఎల్ నినో ఎఫెక్ట్ తో తీవ్రమైన కరువు వచ్చే ప్రమాదముందని హెచ్చరించినా కనీస చర్యలు చేపట్టలేదన్నారు. దొంగలు పడిన ఆరు నెలలకు అన్నట్లుగా ఇప్పుడొచ్చి రైతులు త్యాగాలు చేయాలని నీతులు వల్లించడం సిగ్గుచేటు అన్నారు. కరువు విషయంలో తాను ఏమీ చేయలేనని సీఎం రేవంత్ రెడ్డి నిస్సహాయతను వ్యక్తం చేస్తూ చేతులెత్తేశారని మండిపడ్డారు. పాలకుడికి దూరదృష్టి ఉండాలని.. సీఎంలో అది లోపించిందని అన్నారు. పరిస్థితి మొత్తం చేయి దాటి పోయిన తర్వాత వచ్చి రైతులు త్యాగాలు చేయాలని మాట్లాడటం దారుణమన్నారు. ఆగస్టు నెలలో 28 శాతం లోటు వర్షపాతం నమోదు అయ్యిందని.. అప్పుడే అలర్ట్ అయి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి కేంద్రానికే ఇప్పటికే నివేదిక పంపాయని గుర్తు చేశారు. మన సీఎం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు నింపాదిగా రివ్యూలు

బొగ్గు నుంచి బుల్లెట్ వేగం వరకు..



రాష్ట్ర ప్రయోజనాలపై 8 కీలక ప్రతిపాదనలు

కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 100 కోట్లు కోరిన మంత్రి

వినతులపై కిషన్‌రెడ్డి సానుకూల స్పందన..

కోల్ ఇండియా ఎండీకి అప్పటికప్పుడే ఫోన్

హైదరాబాద్, అక్టోబరు 16: రాష్ట్ర అభివృద్ధి.. రైతుల సంక్షేమం.. పారిశ్రామిక ప్రగతి.. గిరిజన ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు.. విద్య, పరిశోధన రంగాల బలోపేతమే లక్ష్యంగా తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ వేదికగా కీలక ప్రయత్నాలు చేశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని శుక్రవారం కలిసి రాష్ట్రానికి సంబంధించిన ఎనిమిది ప్రధాన అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలని, కీలక ప్రాజెక్టులకు వేగం పెంచాలని కోరారు. ముఖ్యంగా కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించడంతోపాటు కోల్ ఇండియా ఎండీతో అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.యాదాద్రి విద్యుత్ కేంద్రానికి బొగ్గు భరోసాయాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవసరమైన బొగ్గును ముఖ్యమంత్రి కోరిన విధంగా

బతుకమ్మ వేళ పేదలకుసొంతింటి కానుక



- ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు అందజేసిన మంత్రి సీతక్క

ములుగు ప్రతినిధి16 : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. మండల పరిధిలోని 13 గ్రామాలకు చెందిన 109 మంది లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.5.45 కోట్ల నిధులతో నిర్మించనున్న ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతోందన్నారు. బతుకమ్మ పండుగ వేళ మంజూరు పత్రాలు ఇస్తున్నామని, వచ్చే ఏడాది వారు తమ సొంతింట్లో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటారని పేర్కొన్నారు. ములుగు నియోజకవర్గంలో మొదటి విడతలో 5 వేల ఇండ్లు మంజూరు చేశామని, ఈ విడతలో రాని అర్హులకు తదుపరి విడతల్లో అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.పునాది పూర్తయ్యాక బిల్లుల చెల్లింపులు ప్రారంభమవుతాయని, మహిళా సంఘాల సభ్యులకు ప్రారంభ ఖర్చుల కోసం సంఘాల ద్వారా రూ.లక్ష రుణం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఇసుకను స్థానికంగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఉచిత విద్యుత్, రేషన్ బియ్యం, మహిళలకు ఉచిత బస్సు, ఉపాధి హామీ కింద రోజుకు రూ.310 కూలీ వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

అర్బన్ హౌసింగ్ కాలని ప్రజలు ,విద్యార్థుల రవాణా సౌకర్యార్థం ఆర్టిసి బస్సును ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే.

జగిత్యాల జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 16: ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ. 2.77 కోట్ల నిధులతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ లతో కలిసి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న

పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు

విద్యుత్ సరఫరా చేయాలి

మొదటిపేజీ తరువాయి...

నరఫరాపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని అధికారులను నిలదీశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు."ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది నేను. రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి మారలేదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు" అని ముఖ్యమంత్రి తీవ్రంగా హెచ్చరించారు.అవసరమైతే విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీ.. సంబంధిత విభాగపు ఐఏఎస్ లను సస్పెండ్ చేస్తానని మండిపడ్డారు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పవద్దని హెచ్చరించారు.ఎల్‌నినో కోవిడ్ లాంటి వివత్తుఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కోవిడ్ తరహా విపత్తుగా పరిగణించి అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పుడు సాధారణ సమస్యగా కనిపిస్తున్న పరిస్థితులు ముందస్తు చర్యలు చేపట్టకపోతే తీవ్ర సంక్షోభంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు."ఎల్‌నినో కోవిడ్ లాంటి విపత్తు. ఈ పరిస్థితి ఎప్పటివరకు ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇప్పుడు సమస్యగా కనిపిస్తోంది. అప్రమత్తం కాకపోతే సంక్షోభంగా మారుతుంది. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎల్‌నినో ప్రభావాన్ని లోతుగా అంచనా వేయాలి. సమస్యలను అధిగమించేందుకు పరిష్కార మార్గాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ పరిస్థితులు ఎంతకాలం కొనసాగుతాయో చెప్పలేమని, మళ్లీ వానలు వచ్చే వరకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాల్సిందేనన్నారు. వచ్చే జూన్ వరకు ప్రతి శాఖ పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.తాగునీరు, పశుగ్రాసానికి ఇబ్బందులు రాకుండా చర్యలువర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు.ఎల్‌నినో ప్రభావంతో పశువులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి మండలానికి ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుఎల్‌నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్?1, గ్రూప్?2 స్థాయి అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంటలు, పశుగ్రాసం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతలను వారికి అప్పగించాలని సూచించారు.సంబంధిత మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి నివేదించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.గ్రామసభలు, కళాజాతలతో ప్రజల్లో అవగాహనఎల్‌నినో ఒక విపత్తని, దీని ప్రభావం, రాబోయే సంక్షోభ పరిస్థితులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. దసరా తర్వాత దీపావళి వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కళాజాతల ద్వారా ప్రజలకు ఎల్‌నినో ప్రభావాన్ని వివరించాలని, నీరు, విద్యుత్ పొదుపుతో పాటు రాబోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు.గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలకు ఈ విపత్తు తీవ్రతను వివరించాలని ఆదేశించారు. మళ్లీ వర్షాలు వచ్చే వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

మొదటిపేజీ తరువాయి...

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా కాలనీలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజల్లో ఇప్పటివరకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని వారు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకొని పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

కాలనీలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల వారికి ప్రార్థనా స్థలాలు ఏర్పాటు చేసే అంశంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిందూ సోదరులకు దేవాలయం, ముస్లింలకు మసీదు, క్రైస్తవులకు చర్చి ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాలనీలో సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ సమస్య పరిష్కారానికి మొబైల్ టవర్ ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో నివసించే ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ తదితర మౌలిక సదుపాయాలతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర సౌకర్యాలను కూడా దశలవారీగా కల్పిస్తామని చెప్పారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూ, ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాలనీలో విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు రూ.2.77 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజల రవాణా సౌకర్యార్థం బస్సు సర్వీసును ప్రారంభించడం ద్వారా కాలనీ వాసులకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గృహజ్యోతి పథకం కింద అర్హత ఉన్నప్పటికీ ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని కుటుంబాలు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ వంటి సదుపాయాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటూ, కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గట్టుసతీష్,జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ లు గిరి నాగభూషణం అడువాల జ్యోతి – లక్ష్మణ్, టిపిసిసి సెక్రటరీ బండ శంకర్,మున్సిపల్ కౌన్సిలర్ లు, విద్యుత్ శాఖ అధికారులు, హౌసింగ్ అధికారులు, తహసీల్దార్, సంబంధిత వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కరువుపై ముందస్తు చర్యలు చేపట్టటంలో ముఖ్యమంత్రి అట్టర్ ఫ్లాప్

మొదటిపేజీ తరువాయి...



అంటూ కాలం వెళ్లదీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం, ముఖ్యమంత్రి ముందే మేల్కొని ముందస్తుగా చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తప్పేవన్నారు. మన ముఖ్యమంత్రికి ప్రజల మీద శ్రద్ధ, సమస్యల మీద ఫోకస్ లేదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు అవుతుందని.. ఇప్పటి వరకు పాలమూరు- రంగారెడ్డి పూర్తి చేయలేదని, మేడిగడ్డ బ్యారేజ్ ను కూడా రిపేర్ చేయలేదని అన్నారు. వాటిని పూర్తి చేసి ఉంటే ఇవ్వాళ రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 26 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా కొత్తగా నీళ్లు ఇవ్వలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ రిపేర్లు చేసుకోవడానికి ఇదే సరైన సమయమని.. వచ్చే వర్షాకాలంలోగా ఆ పనులు పూర్తి గోదావరి నీళ్లను వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇంకా ఎన్నాళ్లు గత ప్రభుత్వాన్ని తిడుతూ టైమ్ చేస్తారని ప్రశ్నించారు. తిట్టుడు బంద్ చేసి కట్టుడు షురూ చేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఏడాదికి కృష్ణా నీళ్ల ఒప్పందం కుదుర్చుకుంటే ఆ వంకతో తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీసే విధంగా ఏపీకి కృష్ణా నీటి ధారాదత్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు బిడ్డ అయి ఉండి కనీసం భీమా, నెట్టంపాడు ప్రాజెక్ట్ లను కూడా పూర్తి చేయకపోవటం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ తప్పులను ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అవే తప్పులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బొగ్గు నుంచి బుల్లెట్ వేగం వరకు..

మొదటిపేజీ తరువాయి...

మహానది బొగ్గు క్షేత్రాల నుంచి కేటాయించాలని తుమ్మల కోరారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలకమైన ఈ కేంద్రానికి నిరంతరాయంగా బొగ్గు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సింగరేణికి సత్తుపల్లి బ్లాక్-ఎఎఎసత్తుపల్లి బ్లాక్-ఎఎఎ బొగ్గు గనిని సింగరేణి కాలరీస్‌కు కేటాయించాలని ప్రతిపాదించారు. ఇప్పటికే సింగరేణి నిర్వహిస్తున్న గనులకు సమీపంలో ఈ బ్లాక్ ఉండటంతో అందుబాటులోని మౌలిక వసతులను వినియోగించుకోవచ్చని వివరించారు. తద్వారా తవ్వకాలు త్వరగా ప్రారంభించడంతోపాటు అదనపు భూసేకరణ అవసరాన్ని, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించే అవకాశముంటుందని పేర్కొన్నారు.ఆర్ఎఫ్‌సీఎల్ సమస్యకు శాశ్వత పరిష్కారంరామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో సాంకేతిక సమస్యలతో ఉత్పత్తి నిలిచిపోతుండటంతో రాష్ట్రంలో యూరియా సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని మంత్రి వివరించారు.

ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎదురైన అంతరాయాలు రబీ సీజన్‌లో రైతులకు ఎరువుల లభ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జె.పి.నడ్డాతో చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా యూరియా కేటాయింపులు ఉండేలా చూడాలని కోరారు.వర్సిటీకి రూ.100 కోట్ల సీఎస్ఆర్ నిధులుభద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయి విద్యా, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఎర్త్ సైన్సెస్, మైనింగ్, జియాలజీ, పర్యావరణ అధ్యయనాల్లో ఉన్నత ప్రమాణాలతో పరిశోధనలు చేపట్టేందుకు ఆధునిక ప్రయోగశాలలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఈ నిధులు అందుబాటులోకి వస్తే విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని వివరించారు.కొత్తగూడెంలో విమానాశ్రయానికి అనుమతులుభద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే గిరిజన ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపడటంతోపాటు పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విమానాశ్రయాల ప్రాధికార సంస్థ పరిశీలించిన స్థలాలపై సాంకేతిక నివేదికను త్వరగా ఖరారు చేసి, పౌర విమానయాన శాఖతో సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు.రైల్వే లైన్లకు వేగం పెంచాలిరాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కీలక రైల్వే ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా రైల్వే శాఖతో సమన్వయం చేయాలని తుమ్మల కోరారు. సత్తుపల్లి?కొవ్వూరు, పెనుబల్లి?కొండపల్లి కొత్త రైల్వే లైన్లకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ మార్గాలు అందుబాటులోకి వస్తే వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక సరుకుల రవాణా సులభమవుతుందని, ఖమ్మం ప్రాంతానికి ఆంధ్రప్రదేశ్‌తో రైలు అనుసంధానం మెరుగుపడి వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

24గంటలు కరెంట్ ఇస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చాక 6గంటలే మాత్రమే ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ కోతలు..

కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సరైన సమయంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తుంటే, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా? రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని నిలదీశారు.ఎల్‌నినో కాదు.. ప్రకృతి వైపరీత్యం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంవిద్యుత్ సమస్యలకు ప్రకృతి వైపరీత్యాలను సాకుగా చూపిస్తూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకూడదని కౌశిక్ రెడ్డి అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు. నేడు విద్యుత్ సరఫరాపై ప్రజల్లో ఆందోళన నెలకొనడానికి కారణాలేంటి? ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సింగరేణి భవిష్యత్తును సంక్షోభంలోకి నెడుతున్నారా తెలంగాణకు ఆర్థికంగా కీలకమైన సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. సింగరేణి సంస్థ బలోపేతం కావడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఆదాయం, కార్మికుల సంక్షేమం, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. సింగరేణి విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు సంస్థ భవిష్యత్తుకు, కార్మికుల ప్రయోజనాలకు అనుకూలంగా ఉండాలని అన్నారు.సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ అవసరాలు, సంస్థ నిర్వహణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, కార్మికుల హక్కులను కాపాడాలని కౌశిక్ రెడ్డి కోరారు.విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలితెలంగాణ విద్యుత్ రంగం ప్రస్తుత పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర నివేదిక విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి ఎంత ఉంది? రాష్ట్ర అవసరాలు ఎంతవిద్యుత్ కొనుగోళ్లకు ఎంత ఖర్చు చేస్తున్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణాలేమిటి? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ సరఫరా వ్యవస్థ, వ్యవసాయానికి అందించిన విద్యుత్‌పై వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాకుండా, ప్రస్తుత ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించాలని అన్నారు.విద్యుత్ అధికారులను బలిచేసి బాధ్యతల నుంచి తప్పించుకోలేరువిద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు అధికారులపై నెపం నెట్టి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవడం సరికాదని కౌశిక్ రెడ్డి అన్నారు. విద్యుత్ సరఫరా సజావుగా జరిగేలా చూడటం, అవసరమైన వనరులను సమకూర్చడం, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు.సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ, కళ్యాణలక్ష్మి?షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇంకా ఇళ్లు మంజూరు కాని అర్హులైన లబ్ధిదారులకు కూడా దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పెంకుటిళ్లలో నివసిస్తున్న అర్హులైన పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో మహిళల సంక్షేమ పథకాల కోసం రూ.414 కోట్ల మేర నిధులు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రుణమాఫీని అమలు చేసిందని తెలిపారు.

పత్తి కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 16: 2026-27 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ప్రత్తి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పత్తి కొనుగోలు సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ లతో పాటు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 1 లక్ష 72 వేల 141 ఎకరాలలో ప్రత్తి సాగు చేయగా, మొత్తం 16 లక్షల 97 వేల 161 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఎకరానికి సగటున 9.60 క్వింటాళ్ల దిగుబడిని అంచనా వేయడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర ప్రకారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు, లాంగ్ స్టేపుల్ పత్తి ధర క్వింటాలుకు 8 వేల 667 రూపాయలు, మీడియం స్టేపుల్ పత్తి ధర క్వింటాలకు 8 వేల ,267 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని, రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పత్తిని విక్రయించి మద్దతు ధర పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో సి.సి.ఐ. ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కోసం 11 జిన్నింగ్ మిల్లులను ప్రతిపాదించగా, ఇందులో బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 5, చెన్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలో 5, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ పరిధిలో ఒక జిన్నింగ్ మిల్లును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీని తగ్గించి, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు సి.సి.ఐ. అందుబాటులోకి తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు తమ ఆధార్, ఫోన్ నంబర్, భూమి వివరాలు, పత్తి సాగు వివరాలతో యాప్‌లో నమోదు చేసుకోవాలని, అనుకూలమైన కొనుగోలు కేంద్రం / జిన్నింగ్ మిల్లును ఎంపిక చేసుకుని, తేదీ వారీగా స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం ప్రత్తిని విక్రయానికి తీసుకురావచ్చని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారులు రైతు వేదికలలో రైతులకు పత్తిలో తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలు, కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సగటు దిగుబడి కంటే ఎక్కువ దిగుబడి సాధించిన రైతుల భూములను ఏఈఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం సాఫ్ట్‌వేర్‌లో దిగుబడి పరిమితిని నవరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిజిటల్ సంతకం లేని రైతులు, కౌలు రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని, అర్హులైన రైతులందరికీ మద్దతు ధర ప్రయోజనం అందేలా పర్యవేక్షించాలని తెలిపారు. పత్తి కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు శాఖల వారీగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు.:మార్కెటింగ్ శాఖ: ప్రతి మార్కెట్ యార్డులో తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.: రెవెన్యూ శాఖ: గ్రామాలలో దండోరా ద్వారా మద్దతు ధరలు, కొనుగోలు కేంద్రాల వివరాలను రైతులకు తెలియజేయాలి. పత్తిని విడిగా, వదులుగా తీసుకురావాలని సూచించాలి.: తూనికలు కొలతల శాఖ: జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డులలోని తూకం యంత్రాలు, వే-బ్రిడ్జిలను తనిఖీ చేసి, అవసరమైన కాలిబ్రేషన్ చేపట్టాలి.,పోలీస్ శాఖ: రద్దీ ఎక్కువగా ఉండే మార్కెట్ ప్రాంతాలలో శాంతిభద్రతల పరిరక్షణకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలి.,రవాణా శాఖ: ప్రత్తి రవాణా వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలి.అగ్నిమాపక శాఖ: జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డులలో అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు భద్రతా తనిఖీలు నిర్వహించాలి.సి.సి.ఐ. కొనుగోలు కేంద్రాలుగా ప్రతిపాదించిన జిన్నింగ్ మిల్లుల యజమానులు కొనుగోలు ప్రక్రియకు అవసరమైన సాంకేతిక నదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, విండోస్ 10 / అంతకంటే ఉన్నతమైన వెర్షన్ కలిగిన కంప్యూటర్, లేజర్ ప్రింటర్, వెబ్ కెమెరా, ఫింగర్‌ప్రింట్ స్కానర్, ఐరిస్ స్కానర్, ఎం.బి.పి.ఎస్. కంటే ఎక్కువ వేగం కలిగిన ఇంటర్నెట్ కనెక్షన్, సక్రమంగా తనిఖీ చేసిన వే-బ్రిడ్జి కనెక్టివిటీని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి, పత్తి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలి

సర్పంచ్ రాయిసీడం వినోద్‌కుమార్



జననినాదం,తిర్యాణి 16: మంగి గ్రామపంచాయతీ పరిధిలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ రాయిసీడం వినోద్‌కుమార్ కోరారు. నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో ప్రజలు ఫోన్ కాల్స్ చేసుకోవడానికి, ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసర సమయాల్లోనూ ఫోన్ సేవలకు అంతరాయం కలగడం వల్ల ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నెట్‌వర్క్ సేవలను మెరుగుపరిచి, గ్రామస్థుల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

రోవర్లు అందించే ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 16: గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం రోవర్లు అందించేందుకు ఆసక్తి ఉన్నవారు సంబంధిత సరఫరా వివరాల సమాచారాన్ని జిల్లా అధికారిక వెబ్ సైట్ https://mancherial.telangana.gov.in ను సందర్శించాలని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16: జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.
జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి ఆయన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ, వి.ఓ., అంగన్‌వాడీ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేని వాటిని గుర్తించి, వాటి నిర్మాణాలకు వెంటనే మంజూరు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.
పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టిజిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటిని పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.అటవీ భూముల సమస్యలకు ప్రత్యామ్నాయాలుఅటవీ భూములకు సంబంధించిన సమస్యల కారణంగా అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురవుతున్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి, గ్రామ సర్పంచ్‌తో పాటు స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ స్థలాలను ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టాలని, ఈ ప్రక్రియలో అటవీ శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు.జిల్లాలో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని యువరాజ్ మర్మాట్ సూచించారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక సంస్థల అధికారులు పాల్గొన్నారు.

పంటల కొనుగోలు ప్రక్రియకు లారీల యజమానులు సహకరించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 16: జిల్లాలో పత్తి, వరి తదితర పంటల కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు లారీల యజమానులు, జిల్లా లారీ అసోసియేషన్ ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పంటల కొనుగోలు కేంద్రాల నుంచి పంటలను తరలించే రవాణా ప్రక్రియలో, కొనుగోలు కేంద్రాల వద్ద లారీలను అందుబాటులో ఉంచడం, అవసరమైన సమయంలో రవాణా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలలో లారీల యజమానులు సహకరించాలని, పంటల కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పంటల కొనుగోలు, రవాణా ప్రక్రియలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు కలిగించినట్లయితే సంబంధిత వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. పంటల కొనుగోలుకు అవసరమైన రవాణా సదుపాయాలను సమకూర్చే క్రమంలో, అవసరాన్ని బట్టి ఇతర ప్రాంతాల నుంచి లారీలను జిల్లాలోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా లారీ అసోసియేషన్ ప్రతినిధులు, లారీల యజమానులు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.

ప్రజలు లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



జననినాదం,కాగజ్‌నగర్,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16: మారుమూల ప్రాంతాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు వచ్చిన లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ రైలులోని వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.హరిత సూచించారు. శుక్రవారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు సైతం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కంటి, చెవి, ఆర్థోపెడిక్, చీలిక పెదవి, కాలిన గాయాలు, దంత వైద్యం, ప్లాస్టిక్ సర్జరీలకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ వైద్య సేవలపై గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, ఎక్కువ మంది ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులకు సహకరించి, అవసరమైన వారు వైద్య సేవలు పొందాలని కోరారు.256 ప్రాజెక్టులు పూర్తి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ.. కాగజ్‌నగర్ ప్రాంతంలో రెండోసారి లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా వైద్య సేవలు అందించేందుకు ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. 1991లో ప్రారంభమైన ఈ వైద్య రైలు ఇప్పటివరకు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 256 ప్రాజెక్టులను పూర్తి చేసిందని తెలిపారు. 2022లోనూ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో వైద్య సేవలు అందించారని గుర్తుచేశారు. ఈసారి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, తహసీల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ రోహిణి, డాక్టర్ మనోహర్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.



207 దరఖాస్తులు.. లక్కీ లాటరీలో బార్ కేటాయింపు

జిల్లా కలెక్టర్ కె.హరిత



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16: ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో నూతన బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపును లక్కీ లాటరీ పద్ధతిలో చేపట్టారు. మొత్తం 207 దరఖాస్తులు రాగా, లాటరీ ద్వారా మల్లు రమేష్ గౌడ్ ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన లాటరీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఆదిలాబాద్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి నూతన బార్ మంజూరు కావడంతో ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 207 దరఖాస్తులు అందగా, దరఖాస్తుదారుల సమక్షంలో పారదర్శకంగా లక్కీ లాటరీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. లాటరీలో 102 నంబర్ దరఖాస్తుదారుడైన మల్లు రమేష్ గౌడ్ ఎంపికైనట్లు వెల్లడించారు.నిబంధనలు పాటించాలి.బార్ నిర్వహణలో ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా ఆబ్కారీ, మద్య నిషేధ శాఖ అధికారి లక్ష్మీనాయక్, సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు వాలీబాల్ కిట్



జననినాదం,సిర్పూర్(యు) 16: వాలీబాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన సిర్పూర్(యు) జట్టుకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సహకారంతో మేరా యువ భారత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాజీద్, మండల అధ్యక్షుడు కనక ఆనంద్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత యువ క్రీడాకారుల్లో ప్రతిభను ప్రోత్సహించడంతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు కిట్‌ను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆత్రం ఓం ప్రకాశ్, ఉపసర్పంచ్ పెందోర్ రామారావు, సామాజిక కార్యకర్త షేక్ ఆరిఫ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు..

ఎస్పీ నితికా పంత్

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి...

నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు న్యాయం..

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని ఎస్పీ నితికా పంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు.

పెండింగ్ కేసులపై సమీక్ష

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో జాప్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం చేసుకుంటూ కేసులను సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కేసుల నమోదు, దర్యాప్తు, నేరస్తుల వివరాల నిర్వహణ, సమాచార సమన్వయం కోసం సీసీటీఎన్ఎస్ వ్యవస్థను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా...

గంజాయి, మట్కా, జూదం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను గుర్తించి, చోరీకి గురైన సొత్తును రికవరీ చేసి బాధితులకు త్వరగా అందించాలన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, తీవ్రమైన నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సాహంప్రజలు, వ్యాపారులు తమ నివాస ప్రాంతాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాల వల్ల నేరాల నియంత్రణతోపాటు నిందితులను గుర్తించడం సులభమవుతుందని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

పండుగల వేళ అప్రమత్తంగా ఉండాలి.దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. దుర్గామాత ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 112కు వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబందీ, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

పోలీస్ స్టేషన్ల పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడేవారిపై నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి, పట్టుబడిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పండుగల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఎస్పీ అశోక్, కాగజ్‌నగర్ డీఎస్పీ వాహీదుద్దీన్, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్‌గా రాంచందర్



జననినాదం,తిర్యాణి 16: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జవహర్ బాల్ మంచ్ చైర్మన్ నైతం రాంచందర్ నియమితులయ్యారని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క శుక్రవారం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర జవహర్ బాల్ మంచ్ చైర్మన్ మామిడి రిషికేశ్ రెడ్డి ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగినట్లు ఆమె తెలిపారు.

ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన కీలకం

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 16: ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన కీలకం ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన కీలకమని, 2వ దశ జనాభా గనన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సాంకేతిక సహాయకులు, ఛార్జ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, డివైఎస్ఓ రాజేందర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యకలాపాలను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించడం, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించడం, ప్రజలకు అందించే సంక్షేమ పథకాల రూపకల్పనకు అవసరమైన గణాంకాలను సిద్ధం చేయడమే ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జనగణన మొదటి దశలో భాగంగా గృహాల జాబితా తయారీ, గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్యకు సంబంధించిన వివరాలను సేకరించడం జరిగిందని, 2వ దశలో ప్రతి కుటుంబానికి సంబంధించి మొత్తం 40 ప్రశ్నల ద్వారా అవసరమైన సమాచారాన్ని సేకరించవలసి ఉంటుందని తెలిపారు. త్రాగునీటి సరఫరా, కిరోసిన్ వినియోగం, పక్కా ఇళ్ల వివరాలు తదితర అంశాలపై ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని, సేకరించిన సమాచారం ఆధారంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు రూపొందించడంతో పాటు గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలు, ప్రజా సేవల అభివృద్ధికి సంబంధించిన విధానాలను రూపొందించవచ్చని తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్‌కు ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండాలని, ప్రజలకు సందేహాలు ఉంటే నివృత్తి చేస్తూ సరైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. తొలిసారిగా జనగణన ప్రక్రియను డిజిటల్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు మొబైల్ యాప్ ద్వారా సమాచారాన్ని నమోదు చేయడం జరుగుతుందని, జనాభా గణనకు సంబంధించి 2027 మార్చి 1వ తేదీని సూచన తేదీగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. జనగణనలో భాగంగా 15 రోజుల పాటు స్వీయ గణనకు అవకాశం కల్పించడం జరుగుతుందని, స్వీయ గణన ద్వారా వివరాలు నమోదు చేసిన వారికి ప్రత్యేకంగా కేటాయించిన ఎన్.ఈ. ఐ డి. ఆధారంగా ముందుగా నమోదు చేసిన సమాచారాన్ని పరిశీలించవచ్చని, అనంతరం ఎన్యుమరేటర్ సంబంధిత కుటుంబాన్ని సందర్శించి, నమోదు చేసిన వివరాలను ధ్రువీకరించి, అవసరమైన సవరణలు చేస్తారని తెలిపారు. ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించే ఎన్యుమరేటర్‌తో పాటు సూపర్‌వైజర్, ఛార్జ్ అధికారి స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందని శిక్షణలో వివరించారు. సూపర్‌వైజర్లు యాదృచ్ఛికంగా 20 శాతం వివరాలను తనిఖీ చేస్తారని, ఛార్జ్ అధికారులు తమ లాగిన్‌ల ద్వారా సంబంధిత సమాచారాన్ని పరిశీలించి తప్పులను గుర్తించాలని సూచించారు. ఎన్యుమరేటర్లు జనగణనలోని ప్రతి ప్రశ్నను పూర్తిగా అర్థం చేసుకొని, ప్రజలకు స్పష్టంగా వివరించాలని, 15 రోజుల స్వీయ గణన వ్యవధిలో ఎక్కువ మంది ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. శిక్షణలో ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని, క్షేత్రస్థాయి విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విషయాలను పూర్తిగా నేర్చుకోవాలని తెలిపారు. జనగణనలో ఇండ్లు లేని వ్యక్తులతో సహా అర్హులైన ప్రతి వ్యక్తి వివరాలు నమోదు అయ్యేలా చూడాలని, పునఃపరిశీలన సమయంలో మరణాలు తదితర మార్పులను నిబంధనల ప్రకారం నవీకరించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె. కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్య లు సాంకేతిక సహాయకులు, ఛార్జ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





లక్ష్మీపూర్ లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు



రామడుగు15:రామడుగుమండలలక్ష్మీపురంగ్రామంలోగ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ ముందస్తు వేడుకలకు విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ద్యావ అనంతరెడ్డి పాల్గొన్నారు.రంగు రంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని, ఆటపాటలతో ఎంతో ఉత్సాహంగా సందడి చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ద్యావ అనంతరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగ అత్యంత పెద్ద పండుగలలో ఒకటని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని"వారు పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆడపడుచులందరూ ఒక్కచోట చేరి సంతోషాల మధ్య పండుగను జరుపుకోవడం ఎంతో విశేషమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామ స్త్రీమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అర్హత గల ప్రతి ఓటరు వివరాలు జాబితాలో ఉండాలి

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 16: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు జాబితాలో ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 2, 3, 18 వార్డులలో గల పోలింగ్ కేంద్రాలను మండల తహసిల్దార్ సతీష్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈ నెల 15, 16 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరిగిందని, వలస, డబుల్, మృతి చెందిన ఓటర్ల వివరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో అర్హత గల ఓటర్ల వివరాలు తొలగించినట్లయితే సంబంధిత వ్యక్తుల నుండి ఫారం 6 ద్వారా దరఖాస్తు స్వీకరించి, వివరాలను పరిశీలించి జాబితాలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని అర్హత గల ఓటర్ల వివరాలు జాబితాలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వలస, డబుల్, మృతి చెందిన వారి వివరాల తొలగింపునకు ఫారం 7 ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలోని దాదాపు 1 లక్ష 70 వేల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా 1 లక్ష 64 వేల మంది నుండి ధ్రువపత్రాలు స్వీకరించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. జాబితాలో అర్హత గల ప్రతి ఒక్కరి వివరాలు ఉండాలని, అనర్హుల వివరాలు ఉండకూడదని తెలిపారు. ప్రత్యేక శిబిరాల తేదీలలో బూత్ స్థాయి అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో అందుబాటులో ఉంటారని, ఓటర్లకు ఏమైనా సందేహాలు, సమస్యలు ఉన్నట్లయితే సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు, నోటీసులకు సంబంధించి ధృవపత్రాలను అందించవచ్చని తెలిపారు. ముసాయిదా జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.అంతకుముందు క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండలిని మండల తహసిల్దార్ తో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీలు, గ్రామాలలో అవసరమైన లైటింగ్, పారిశుద్ధ్యం ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. దసరా ఉత్సవాలలో భాగంగా దుర్గామాత మండళ్ల ఏర్పాటులో భాగంగా అవసరమైన పోలీస్, రెవెన్యూ, విద్యుత్ సంబంధిత శాఖల అనుమతులు నిబంధనల ప్రకారం జారీ చేయడం జరిగిందని తెలిపారు. బతుకమ్మ, దసరా పండుగను ప్రజలందరూ సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు.అనంతరం బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 25, 12, 13 వార్డులలో గల పోలింగ్ కేంద్రాలను మండల తహసిల్దార్ కృష్ణ తో కలిసి సందర్శించి ప్రత్యేక శిబిరాల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మొకాశి ముండాల వద్ద దసరా పూజలు

జననినాదం,కాసిపేట 16: మండలంలోని దేవాపూర్--గాంధారి ఖిల్లా పొలిమేరలో కొలువైన మొకాశి ముండాల వద్ద కోవ వంశీయులు గురువారం దసరా పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచులు, పటేళ్ల సహకారంతో అర్ధరాత్రి వరకు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు చేపట్టినట్లు గాంధారి ఖిల్లా కోవ మొకాశి వంశీయుల సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కోవ భాగుబాయి తెలిపారు. ఈ సందర్భంగా కోవ మొకాశీల వారసుడు కోవ సూరు మాట్లాడుతూ తాతముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ ఏటా నియమ నిష్ఠలతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించి, వసతి సౌకర్యాలు కల్పించిన మద్దిమడ, దేవాపూర్, తాటిగూడ గ్రామ పంచాయతీల సర్పంచులు ఆడ జంగు, రాయిసిడం రాందాస్, మడావి వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయి సెంటర్ సార్మేడి కుంరం జనార్ధన్, ఆదివాసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు కొడప అనంతరావు, ప్రధాన కార్యదర్శి పెంద్రం శంకర్, వివిధ గ్రామాల పటేళ్లు, యువకులు, కోవ పరివార్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జననినాదం,సిరికొండ 16: నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం సిరికొండ మండల కేంద్రానికి వచ్చిన ఆయనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంతో పాటు, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460